భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

మాక్ పార్లమెంటులో మెదక్ విద్యార్థిని సంచలనం.. ఫస్ట్ ప్రైజ్!

భారత్ సమాచార్, మెదక్ జిల్లా: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మాక్ పార్లమెంటు కార్యక్రమంలో మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని PM శ్రీ మోడల్ స్కూల్ విద్యార్థిని బి. ఆర్తి చంద్ర అద్భుత ప్రతిభ కనబరిచారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రథమ బహుమతిని సాధించి పాఠశాలతో పాటు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థిని సాధించిన ఈ విజయంతో పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల్లో ఆనందం నెలకొంది.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో PM శ్రీ పాఠశాలల విద్యార్థుల కోసం హైదరాబాద్‌లోని SCERT గోదావరి హాల్‌లో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఒక్కో జిల్లా తరఫున ఇద్దరు విద్యార్థులు చొప్పున హాజరయ్యారు.

పార్లమెంటరీ విధానాలు, చర్చలు, వివిధ అంశాలపై అభిప్రాయాల వ్యక్తీకరణ వంటి అంశాల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో చిన్నశంకరంపేట PM శ్రీ మోడల్ స్కూల్‌కు చెందిన బి. ఆర్తి చంద్ర తన వాక్చాతుర్యం, ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారు. ప్రథమ బహుమతిని కైవసం చేసుకుని తన సత్తా చాటారు.

ఈ సందర్భంగా స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ మదన్‌మోహన్ చేతుల మీదుగా ఆర్తి చంద్ర అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో తమ పాఠశాల విద్యార్థిని మొదటి బహుమతి సాధించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణికుమారి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని ఆర్తి చంద్రతో పాటు ఆమెకు మార్గదర్శకత్వం వహించిన గైడ్ ఉపాధ్యాయుడు టి. లింగమయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

అలాగే జిల్లా విద్యాధికారి రాజు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి కూడా ఆర్తి చంద్రను, గైడ్ ఉపాధ్యాయుడు లింగమయ్యను అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థిని మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ బహుమతి సాధించిన ఆర్తి చంద్ర విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

© 2026 Bharath Samachar